ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి



5

## పల్నాడు జిల్లా వార్తలు

మంగళవారం 19 మే 2026

## ఉద్యాన రైతుకు ఊతం

- హార్టికల్చర్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం ఆర్థిక సాయం
- ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు అర్హులు
- నిరంతరంగా దరఖాస్తుల స్వీకరణ

8



### లెక్కలేని దోపిడీ

ఒక గ్రామ పంచాయతీకి అనేక రకాల నిధులు, ఆదాయ వనరులు, ప్రభుత్వ గ్రాంట్లు మంజూరవుతుంటాయి. వీటిని దామాషా ప్రకారం ఖర్చు చేయాలని 2017లో జీవో నంబరు 19 ప్రకారం దీనిని స్పష్టం చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులకు 30, శానిటేషన్ కోసం 15, వీధి దీపాల కోసం 15, తాగునీటి సరఫరాకు 15, రోడ్లు, డ్రెయిన్‌లకు 10, ఇతర ఖర్చులకు 5 శాతం మాత్రమే ఖర్చు చేయాలి. కానీ, తాజా సవరణలతో వైద్యం, విద్య, సంక్షేమం, వ్యవసాయం వంటి రంగాల సహకారం కోసం మరో 10 శాతం నిధులు ఖర్చు చేయొచ్చని.. పంచాయతీ రాజ్ శాఖ పేర్కొంది. వీటిలో దేనికీ సంబంధం లేకుండా కొత్త అంశాలను చేర్చి నిధులు పప్పుబెల్లాల్లా ఖర్చు చేసినట్టు లెక్కల్లో చూపారు.

### నిచ్చెన మోస్తే రూ.50వేలు

తెనాలి మండలం పెదరావూరు పంచాయతీలో వీధి దీపాల మరమ్మతుల్లో భాగంగా.. నిచ్చెన మోయడానికి ఒకరిని నియమించుకున్నామని, అతనికి రూ.50 వేలు చెల్లించినట్లు లెక్కల్లో చూపారు. సాధారణంగా మరమ్మతులు నిర్వహించే వ్యక్తే నిచ్చెనను మోసుకెళ్తారు. దీనికి ప్రత్యేకంగా నిధులు ఖర్చు చేయడాన్ని ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఓ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఇదే తరహాలో రాష్ట్రంలోని పంచాయతీల్లో లెక్కలు లేని ఖర్చుల పేరుతో దోచేశారని.. వీటన్నింటిపై విచారణ జరిపించనున్నట్టు పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో 180, బాపట్ల జిల్లాలో 80, పల్నాడు జిల్లాలో 100కిపైగా పంచాయతీల రికార్డుల్లో అవకతవకలు స్పష్టంగా కనిపించినట్లు ఉన్నతాధికారులే చెబుతున్నారు. కొన్నింటిలో అసలు రికార్డుల నిర్వహణే లేకపోవడం గమనార్హం.

# పంచాయతీలను.. పిండేశారు

## గత ప్రభుత్వంలో భారీగా నిధుల గోల్‌మాల్

- నిచ్చెన మోస్తే రూ.50వేలు.. షాక్ తిన్న మంత్రి
- బిల్లులు, ఎం బుక్‌లు లేకుండా దోపిడీ సర్పంచ్‌లు, కార్యదర్శుల కుమ్మక్కు.
- మామూళ్ల మత్తులో ఉన్నతాధికారులు
- తనిఖీకొస్తే.. రూ.10వేలు, ఫుల్ ట్యాంక్ ఆయిల్..
- ప్రత్యేకాధికారుల పరిశీలనలో అక్రమాలు తేటతెల్లం
- విచారణ జరిపితే రూ.కోట్ల అవినీతి గుట్టు రట్టు!






నరసరావుపేట మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రత్యేకా .ధికారుల పాలనలో.. పంచాయతీల రికార్డులు, జమా ఖర్చుల చిట్టా విప్పితే విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బిల్లులు లేకుండా, అసలు రికార్డుల నిర్వహణే మరిచి.. ప్రజాధనాన్ని అప్పనంగా దోచేసినట్లు తేటతెల్లమవుతోంది. సొంత ఖర్చులకు, జల్సాలకు కూడా పంచాయతీల నిధులను వాడేశారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు (మిగతా 8వ పేజీలో)

వీధి దీపాల మరమ్మతులకు నిచ్చెన మోస్తే రూ.50వేలు. టీలు, కాఫీలు తాగడానికి రూ.2.5 లక్షల ఖర్చు. మురుగు కాల్వల పూడిక తీత, చెత్త ట్రాక్టర్ నిర్వహణ.. ఇలా చెప్పుకుంటూ పోతే కాదేదీ దోపిడీకి అనర్హం అన్నట్లు ప్రజాధనాన్ని లెక్కా పత్రం లేకుండా పంచాయతీల్లో దోచేశారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి.. ప్రత్యేకాధికారుల పాలన రావడంతో.. ఈ గోల్‌మాల్ భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఎన్నికైన వైసీపీ సర్పంచులు, స్థానిక నేతలు దోపిడీకి తెగబడితే.. టీడీపీ, జనసేన సర్పంచ్‌లున్న చోట కూడా ఆ పార్టీ నేతలే అధికారులను అడ్డుపెట్టుకుని నిధులను నీళ్లలా పిండుకున్నారు.



# వార్డులు పెంచారు

### 24 లోపు అభ్యంతరాల స్వీకరణ

- మునిసిపాలిటీల్లో పెరిగిన వార్డులు 63
- గుంటూరు కార్పొరేషన్‌కు 19 డివిజన్‌లు
- కార్యాలయాల్లో ప్రతిపాదనల ప్రదర్శన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు.. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మునిసిపాలిటీల్లో వార్డుల సంఖ్య 306 నుంచి 369, గుంటూరు కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్య 57 నుంచి 76కు పెరిగింది. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట, బాపట్ల జిల్లా కేంద్రం బాపట్ల, పొన్నూరు మునిసిపాలిటీలు, గుంటూరు జిల్లాలోని మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్విభజన ప్రక్రియ నుంచి మిన హాయించారు. నరస రావుపేట, బాపట్ల, పొన్నూరులో శివారు ప్రాంతాలను విలీనం చేసి, వార్డుల సంఖ్యను గత ఎన్నికల ముందు పెంచారు. మంగళగిరి- తాడేపల్లి మునిసి పాలి టీలను విలీనం చేసి.. కార్పొరేషన్ చేశారు. ఇక్కడ వార్డుల విభజన సక్రమంగా జరగలేదని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఆయా మునిసిపాల్టీలకు ఎన్నికలు నిలిపివేసిన విషయం తెలిసిందే. వీటిని మినహాయించి, మిగిలిన మునిసిపాలిటీలకు వార్డుల పునర్విభజన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. కోర్టు కేసులు పరిష్కారం అయితేనే ఆయా మునిసిపాలిటీల్లో (మిగతా 8వ పేజీలో)

మునిసిపాల్టీల వారీగా పెరిగిన వార్డు సంఖ్య

| మునిసిపాల్టీ | ప్రస్తుతం | పెరిగినవి |
|---|---|---|
| తెనాలి | 40 | 52 |
| చీరాల | 33 | 44 |
| పిడుగురాళ్ల | 33 | 40 |
| రేపల్లె | 28 | 36 |
| మాచర్ల | 31 | 36 |
| సత్తెనపల్లి | 31 | 36 |
| వినుకొండ | 32 | 36 |
| దాచేపల్లి | 20 | 28 |
| గురజాల | 20 | 23 |
| గుంటూరు | 57 | 76 |

పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో వార్డులు, డివిజన్‌ల పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యింది. పునర్విభజన ప్రాథమిక వివరాలు కలిగిన ఫాం - 1ను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారు. మునిసిపాలిటీ / కార్పొరేషన్‌లతో పాటు.. ప్రభుత్వ, స్వర్ణ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శనకు పెట్టారు. పునర్విభజనపై అభ్యంతరాలను, సూచనలను ఈ నెల 24 వరకు స్వీకరించనున్నారు. రెండుసార్లు వాయిదా అనంతరం మూడోసారి పునర్విభజన ప్రకటన వెలువడటంతో పట్టణాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు రాజకీయ పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు. సెప్టెంబరులో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది.

# రూ.3 కోట్ల స్థలం.. మునిసిపాలిటీకి

ఫలించిన సామాజిక కార్యకర్త పోరాటం ● ఆక్రమణ స్థలం స్వాధీనానికి చర్యలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం సెంటర్ అత్యంత విలువైన ప్రాంతం. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉన్న మునిసిపాలిటీ స్థలం ఏళ్లుగా కబ్జాకు గురైంది. పురపాలకులు దీనిని స్వాధీనం చేసుకోవడంలో పట్టీ పట్టనట్లు వ్యవహరించారు. స్థలం తమదే అన్నట్లు ఆక్రమణ దా రులు వ్యవహరిం చారు. కోర్టులో పిటిష న్లు దాఖలు చేస్తూ ఇన్నాళ్లూ నెట్టుకొచ్చా రు. సదరు వ్యక్తులకు రాజ కీయ పలుకుబడి ఉండటంతో ఆ స్థలం వైపు కన్నెత్తి చూసేందుకు కూడా మునిసిపల్ అధికారులు సాహసం చేయలేదు. కోర్టులో కూడా సరైన వాదనలు వినిపించలేకపోయారు. కానీ, సామాజిక కార్యకర్త బొగ్గరం మూర్తి ఈ స్థలం విషయంలో న్యాయపోరాటం చేశారు. వార్డు నంబరు ఒకటి, సర్వే బ్లాక్ నంబరు 23, టీఎస్ నంబరు 1620.. 2287లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ మేరకు కోర్టు మునిసిపాలిటీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఎన్నో ఏళ్లుగా మునిసిపాలిటీ చేయలేని పని సామాజిక కార్యకర్త వల్ల సాధ్యమైంది. దీంతో దాదాపు రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని మునిసిపాలిటీ సొంతం చేసుకునేందుకు సమాయత్తమవుతోంది. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి.. గడువు దాటినా వారు ఆధారాలు సమర్పించకపోవడంతో స్థలం స్వాధీనం చేసుకోనున్నట్లు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సోమవారం తెలిపారు.



ఆర్డీవో కార్యాలయం ఎదురుగా కబ్జా గురైన స్థలం

# శీతల గిడ్డంగులు ఖాళీ

- ప్రత్తిపాడులో 49.24 శాతం భర్తీ
- గుంటూరులో 25.74 శాతం నిండిన స్టోరేజ్‌లు
- ఆందోళనలో యాజమాన్యాలు

### ఉష్ణోగ్రత

| 19-5-26 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 43 | 29 |
| తెనాలి | 42 | 29 |
| నరసరావుపేట | 43 | 29 |
| రెంటచింతల | 44 | 30 |
| బాపట్ల | 40 | 29 |
| చీరాల | 40 | 29 |

పెదకూరపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏటా మే నెల మొదటి వారంలో గుం టూరు మిర్చి యార్డుకు వేసవి సెలవు లు ప్రకటించగానే గుంటూరు, ప్రత్తి పాడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న కోల్డ్‌స్టోరేజ్‌ల వద్ద సందడి కనిపించేది. రైతులు తమ చివరి కోత మిరప కాయలను, స్టాకిస్టులు సీజన్‌లో కొను గోలు చేసిన మిర్చి టిక్కీలను తీసుకొచ్చి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసే వారు. ఒక్కో ఏడాది అయితే ఏప్రిల్ నెల చివరి వారంలోనే తమ కోల్డ్ స్టోరే జ్‌లు వంద శాతం నిండిపోయాయంటూ.. పలు (మిగతా 8వ పేజీలో)



50 శాతం దాటని స్టోరేజ్..

గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 34 కోల్డ్ స్టోరేజ్‌లు న్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 25,07,000 మిర్చి టిక్కీలు. ఏటా 80 నుంచి 90 శాతం వరకు స్టోరేజ్‌లు నిండేవి. ఈ సంవత్సరం తేజ 3,43,400 టిక్కీలు, ఇతర వెరైటీలు 3,02,041 బస్తాలు స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. ఇంకా 18,61,559 టిక్కీలు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే కేవలం 25.74 శాతం మాత్రమే ఇప్పటి వరకు కోల్డ్‌స్టోరేజ్‌లలో చాంబర్లు భర్తీ అయ్యా యి. కాగా ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో 65 శీతల గిడ్డంగులున్నాయి. వీటిల్లో ప్రస్తుతం తేజ వెరైటీ మిర్చి బస్తాలు 16,27,446, ఇతర వెరైటీలు 19,14,215 ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి 71,92,000 మిర్చి టిక్కీల నిల్వ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 49.24 శాతంతో 35,41, 661 టిక్కీలు ఉన్నాయి.

# జూలై ఆఖరుకు.. సాగర్ నీరు

నరసరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): సాగునీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. ఈ సారి ముందుగానే సాగునీటి విడు దల ప్రణాళికను ప్రకటించింది. సాగునీటి ప్రణా ళిక సమావేశంలో మంత్రులు నిమ్మల రామా నాయుడు, అచ్చెన్నాయుడు సాగర్ జలాశయం నీటి విడుదలపై సమీక్షించారు. కుడి కాల్వకు జూలై ఆఖరకు నీటిని విడుదల చేయ నున్నట్టు మంత్రి రామా నాయుడు ప్రకటిం చారు. పచ్చిరొట్ట విత్తనాలు ఈ నెలాఖరుకు జిల్లాకు సరఫరా అయ్యే అవకాశాలున్నాయి. సాగర్‌కు వచ్చే వరద మేరకు సాగునీటి ప్రణాళిక అమలు చేయనున్నారు. అయితే తొలకరి జల్లులు కురిసిన వెంటనే పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సాగర్ నీటి పైనే పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పంటల సాగు ఆధారపడి ఉంది.

## ఏఎంసీ పదవీ కాలం పొడిగింపు

నరసరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15న పదవి కాలం ముగియగా.. కమిటీ కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ ఛైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు ఉన్నారు.



## భవన నిర్మాణ కార్మికుడికి భరోసా

8

## నీటి పరీక్షతో రక్షణ

- వసతి గృహాల్లో నీటి పరీక్షకు ప్రత్యేక కార్యాచరణ
- ఆయా వసతి గృహాలకు చేరిన నీటి పరీక్షల కిట్లు



## తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని టోకరా

6

- రూ. 17 లక్షలు కాజేసిన దుండగులు
- నిందితులు అరెస్టు.. రూ.14లక్షలు స్వాధీనం

# రైతు బజారు స్థలానికి ఎసరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట పట్టణంలో మసీదును తొలగించి.. పునః నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రార్థనలు చేసుకోవడానికి.. ముస్లిం పెద్దలు రైతు బజారు స్థలాన్ని కేటాయించాల ని మునిసిపాలిటీని కోరారు. ఇందుకు అధి కారులు అంగీకరించారు. మసీదు నిర్మాణం పూర్తయ్యింది.. అందులో ప్రార్థనలు కూడా జరు గుతున్నాయి. అయితే రైతు బజారు స్థలాన్ని తిరిగి అప్పగించే ప్రయత్నాలు జరగడం లేదు. ఇక్కడ మదర్సా నిర్వహిస్తామంటూ కొందరు బోర్డు ఏర్పాటు చేశారు. అత్యంత విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో పుర అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా స్థలం స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మునిసిపాల్టీ రైతు బజారు స్థలం

# బడిలో స్వచ్ఛ జలం

- ఆర్వో ప్లాంట్ల మరమ్మతులకు కార్యాచరణ
- మూమూళ్ల కక్కుర్తితో గతంలో నిర్వహణ శూన్యం
- మూలకు కొన్ని, ఇన్‌స్టలేషన్ కాక మరికొన్ని..
- పాఠశాలల పునః ప్రారంభం నాటికి ఏర్పాటు

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అవసానదశకు చేరుకున్న ఆర్వో ప్లాంట్ల మరమ్మతులపై.. కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఆర్వో ప్లాంట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేసింది. అందుకోసం ఇప్పటికే కాంట్రాక్టు సంస్థలతో సమగ్ర శిక్ష అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దశలవారీగా ఇన్‌స్టలేషన్, మరమ్మతులు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

### కమీషన్ల కక్కుర్తి..రెండు సంస్థలకే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆరో ప్లాంట్ల ఏర్పాటు కాంట్రాక్ట్‌ను రెండు సంస్థలకే ఇచ్చినట్లు నివేదికల ఆధారంగా స్పష్టమవుతోంది. వాస్తవంగా మార్కెట్లో పేరున్న అనేక కంపెనీలు ఉన్నా.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం కమీషన్ ఇచ్చిన సంస్థలకే ఆరో ప్లాంట్ ఏర్పాటు కట్టబెట్టినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇన్నోవేటివ్ ఆక్వా, లైవ్ పూర్ అనే సంస్థలే ఎక్కువ శాతం ఆరో ప్లాంట్లను పాఠశాలల్లో ఏర్పాటు చేశాయి. ఆయా కంపెనీలకు నిర్వహణ సామర్థ్యం ఉందా, సాంకేతిక నిపుణులు ఉన్నారా లేదా? అనే విషయాలపై ఆలోచన చేయలేదు. నాటి ప్రభుత్వ నిర్వాకంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు అందలేదు.



పాఠశాలలో ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

### తెచ్చారు..వదిలేశారు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 'నాడు - నేడు' పథకంలో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో దాదాపు 2 వేలకు పైగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. ప్లాంటుకు సగటున రూ.1.50 లక్షల నుంచి రూ.3లక్షల వెచ్చించి కొనుగోలు చేశారు. ఆయా ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన తర్వాత నిర్వహణ, మరమ్మతుల విషయం పట్టించుకోలేదు. దీంతో ఏడాదికే దాదాపు 40 శాతానికిపైగా ప్లాంట్లు మూలన పడ్డాయి. మరికొన్ని పాఠశాలల్లో నేటి వరకు ఇన్‌స్టలేషన్ చేయకుండా షెడ్లకే పరిమితం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల పాఠశాలల వారీగా ఆరో ప్లాంట్ల పరిస్థితి పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక నివేదిక రూపొందించి, (మిగతా 8వ పేజీలో)

# చివరి ఆయకట్టుకూ నీరందాలి!

- కాంక్రీట్ లైనింగ్‌తోనే పారుదల సుగమం
- పల్నాడు రైతులు విన్నపం

పిడుగురాళ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడికాలువ పరిధిలోని పల్నాడు జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే మేజర్, మైనర్ సాగునీటి కాల్వలు ఉన్నాయి. అందులో మేజర్ కాల్వలకు కాంక్రీట్ లైనింగ్ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సారీ మరమ్మతులు చేపట్టడం.. రెండేళ్లు తిరిగేసరికి అవే పనులు మళ్లీ చేయడం ప్రభుత్వానికి ఖర్చుతో కూడుకున్నదని చెబుతున్నారు. పల్నాడు ప్రాంతంలో మరస, రాతి నేలలు ఎక్కువగా ఉన్నాయి. ఆకురాజుపల్లె, ధైద, గొట్టిముక్కల, రామాపురం, తంగెడ, మేజర్లతో పాటు మాచర్ల, వినుకొండ నియోజక వర్గాల పరిధిలో ఎక్కువశాతం మేజర్, మైనర్ కాల్వలన్నీ రాతినేలలోనే ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. దీంతో సాగర్ నీరు విడుదల చేశాక ఈ రాతి నేలలో ఇంకిపోతోందని, దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు వారాబందీ అమలు చేయాల్సి వస్తోందని రైతులు వెల్లడిస్తున్నారు. మేజర్ కాల్వలకు గత ఐదేళ్లు మర మ్మతులు చేయక.. రైతులు సాగునీటికి నానా ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మేజర్, మైనర్ కాల్వల మరమ్మతులను పూర్తిచేయించి గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో చివరి భూములకు సాగునీరు అందించేలా కృషి చేశారు.



మరమ్మతులు పూర్తిచేసిన పిల్లుట్ల మేజర్ (పాత చిత్రం)

### మరమ్మతులకు రూ.కోట్లు ఖర్చు..

సాగు నీటి కాల్వల మరమ్మతులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే అరకొరగా నిధులు మంజూరవుతున్నాయి. ఈ నేపథ్యంలో మైనర్ కాల్వలను పక్కనపెట్టి మేజర్ కాల్వలకు కాంక్రీట్ లైనింగ్ చేస్తే పదేళ్ల పాటు మరమ్మతులు చేసే అవసరం ఉండదని రైతులు చెబుతున్నారు. ఎన్ఎస్పీ అధికారుల అంచనాల ప్రకారం గురజాల, మాచర్ల పరిధిలో మేజర్లకు కాంక్రీట్ లైనింగ్‌కు సుమారు రూ.1,200 కోట్లు నిధులు అవసరం.

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867

## రీసర్వేపై సమీక్షకు హాజరుకావాలి

● తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

మాచవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): గురజాల రెవెన్యూ డివిజన్‌లో మంగళవారం జరిగే రీసర్వేపై జరిగే సమీక్షా సమావేశానికి మండల పరిధిలోని సర్వేయర్లు, వీఆర్‌వోలు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించటం జరుగుతుందని, హాజరు కానివారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

## పిల్లల శారీరక, మేధో సంపత్తి పెంపొందించాలి

ముప్పాళ్ళ, మే 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో శారీరక, భాష, మేధో సంబంధిత అంశాలను పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ శివారు కుంకవారిపాలెం ఎస్టీ అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం పిల్లల శారీరక, భాషా, మేథో, గణిత, సామాజిక భావోద్వేగ సృజనాత్మక అభివృద్ధి అనే పలు అంశాలపై తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పలు చార్టులను ఉపయోగించి పిల్లల అభివృద్ధికి సంబంధించిన అంశాలను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త టీ గీత ఉన్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 32.33 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 400క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

## నీట్ వ్యవస్థ భ్రష్టు పట్టింది

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్ ప్రవేశం కోసం జరుగుతున్న నీట్ పరీక్షా విధానం పూర్తిగా భ్రష్టు పట్టిందని మరోమారు నిరూపితమైందని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అవడం దారుణమన్నారు. లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారన్నారు. ఆయన వెంట వంగపాటి నాగరాజు, పెద్ద అంజి తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేటలోని శ్రీ తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010 - 11 సంవత్సర పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో వారి అనుబంధాల పై ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ 25వేలు మైకును అందజేయనున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు.

## కొనసాగుతున్న గ్రంథాలయ శిక్షణ శిబిరం

అచ్చంపేటలోని శాఖా గ్రంథాలయంలో 17వ రోజు వేసవి శిక్షణా శిబిరం నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి బీ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కార్టూన్‌ల పై అవగాహన కల్పించారు. ఆటల పోటీలు, కథలు తదితర వాటి పై విద్యార్థులకు ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాసరావు, కే దుర్గా చైతన్య తెలియ జేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు: ఎస్ఐ

విజయపురిసౌత్, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో ఇరువురిని అదుపులోకి తీసుకుని మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. అలాగే పాత బ్రిడ్జి వద్ద మద్యం సేవిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రూ.1000 జరిమానా విధించారన్నారు.

## చలివేంద్రంలో ఫ్లెక్సీనే మిగిలింది..




మంచి నీరు లేని కుంకలగుంటలోని చలివేంద్రం

నకరికల్లు, మే 18 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంట పంచాయతీ పీడీవో ఆదేశాల మేరకు కుంకటగుంటలో ఏర్పాటుచేసిన చలివేంద్రం రెండు రోజులకే మూతపడింది. ఆ తరువాత మంచినీరు పోయలేకపోగా ఉన్న కుండలే పగిలిపోయాయని స్థానికులు తెలిపారు. దీని నిర్వహణపై పంచాయతీ అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అవికూడా ప్రజలకు అందుబాటులో ఏర్పాటుచేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

## ఎన్ఎస్‌పీ కార్యాలయంలో ఇంకుడు గుంత

సత్తెనపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార, జలహారతి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్ఎస్‌పీ ఓఎం డివిజన్ ఈఈ మురళీధర్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతను తీయించారు. ఇంకుడు గుంత ద్వారా కార్యాలయ ఆవరణలో గల బోరు బావిలోకి నీరు ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింప చేసి భూగర్భ జలాలను పెంచటమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పలువురు డీసీలు, ఏఈలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంత తీస్తున్న దృశ్యం

## నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేసి నియోజక వర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో టీడీపీ, రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టీడీపీలో క్రమశిక్షణ, అంకిత భావం కలిగిన శ్రేణులు ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో జరగబోయే క్లస్టర్ స్థాయి మహానాడును పార్టీ నాయకులు, కార్యకర్తలంతా విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. అత్యధిక కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం అన్నారు. వంద రూపాయల సభ్యత్వంతో రూ 5 లక్షల బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కల్పించారన్నారు. ఇంకా పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై కన్నా మాట్లాడారు. సమావేశంలో సరికొండ వెంకటేశ్వరరావు, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, కనుమూరి బాజీ చౌదరి, గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, మక్కపాటి రామచంద్రరరావు, పూజల వెంకట కోటయ్య, అంచుల నరసింహారావు, మాబూ, నూర్ బాషా జానీ బాబు, శోభారాణి, శారదాదేవి, కే శ్రీనివాసరావు, ఆళ్ళ అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విద్యార్థినులు ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, రావెల సత్యనారాయణ తదితరులు

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

● డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్

నకరికల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని నరసరావుపేట డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ తెలిపారు. సోమవారం మండలంలోని కండ్లకుంటలో రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వివిధ పంటల్లో వస్తున్న కొత్త రకాలు, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలిపారు. రైతులు ఏర్పాటుచేసిన వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, డాక్టర్ టీ సుధాకరరెడ్డి, పిడుగురాళ్ళ ఏడీఏ బీ శ్రీకృష్ణదేవరాయలు, నకరికల్లు ఏవో కే దేవదాసు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పీఆర్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## గురువింద గింజలా వైసీపీ తీరు

● ఎమ్మెల్యే జూలకంటి విమర్శ

రెంటచింతల, మే 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ దుర్మార్గ పాలనలో ప్రజలను ఇక్కట్లకు గురిచేసి డ్రామాలు ఆడుతున్నారు. చాలాసార్లు పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచారు. జలజీవన్ మిషన్‌కింద మంజూరైన రూ.2 వేల కోట్లను పూర్తి స్థాయిలో ఖర్చుపెట్టలేకపోయారు. కరోనా వ్యాప్తి చెంది మృత్యుఘోష ఏర్పడుతుంటే నాణ్యత లేని చీప్‌లిక్కర్‌ను మాచర్లలో విక్రయించి పేదల మరణానికి కారకులై జేబులు నింపుకున్న వైసీపీ నేతలు ధర్నాలు, నిరసనలు చేయడం సిగ్గుచేటని.. ఆ పార్టీ తీరు గురువింద గింజ సామెతలా వుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. సోమవారం మంచికల్లు గ్రామంలో పర్యటించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నేతలకు లోకజ్ఞానం కరువైందన్నారు. సీఎం చంద్రబాబు హైటెక్ సిటీని నిర్మించిన తీరు చూసి సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ వేనోళ్ల పొగుడుతుంటే ఇక్కడ వైసీపీ నేతలకు చంద్రబాబు చేసిన మంచిపనులు చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. 36 రోజుల్లో పుట్టపర్తిలో లక్షల కోట్లు విలువ చేసే రక్షణ, డ్రోన్, హెలికాప్టర్ల తయారీ ప్రాజెక్టు రావడం చంద్రబాబు కృషి, పట్టుదలకు సంకేతమని ఇదే విషయాన్ని దేశంలోని వివిధ పార్టీల నేతలంతా ప్రశంసలు కురిపిస్తుంటే వైసీపీ నేతలకు మింగుడుపడకుండా ఉందని ఎద్దేవ చేశారు. హర్మోజ్ జలసంధి ద్వారా వివాదం ఏర్పడడం వలన ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్ సంక్షోభం ఏర్పడడం వల్ల పీఎం మోడీ పెట్రోలుపై 3.2 శాతం, డీజిల్‌పై 3.4 శాతం మాత్రమే పెంచారని అదే వైసీపీ పాలనో 8 సార్లు ధరలను పెంచి జనాన్ని బాదిన చరిత్ర వైకాపాదని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర నేత యరపతినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, వెంకట్రామిరెడ్డి, పుల్లారెడ్డి,శ్రీనివాసరెడ్డి, పున్నారెడ్డి, మహేశ్‌రెడ్డి, చేర్రెడ్డి కోటిరెడ్డి, బీసీ నేత బి.గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి, టీడీపీ రాష్ట్ర నేత యరపతినేని వెంకటేశ్వర్లు

## ఉపాధి హబ్‌గా దుర్గి మండలం

● నిరుపేదల జీవనాడిగా పరిశ్రమలు

దుర్గి, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో పల్నాడు ప్రాంతంలో నక్సలైట్ల ప్రభావంతో అభివృద్ధి కుంటుపడింది. పరిశ్రమలు రాకపోవడంతో దుర్గి మండలం అభివృద్ధికి నోచుకోలేదు. ఉపాధి లేక వలస వెళ్లే పరిస్థితి నెలకొంది. పల్నాడు ప్రాంతంలో అత్యంత వెనుకబడిన మండలంగా దుర్గి మండలం పేరు గాంచింది. ఈ ప్రాంతంలో క్రమేమి నక్సలిజం తగ్గిపోవడం, భూమి రేటు తక్కువగా ఉండడంతో అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య దుర్గి శివారులోని ఆత్మకూరు గ్రామం వద్ద మిర్చి మార్కెట్ యార్డుకు శంకుస్థాపన చేశారు. దీంతో ఒక్కసారిగా వ్యాపారవేత్తలు భూములను కొనుగోలు చేశారు. పదుల సంఖ్యలో డాల్ మిల్లులు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని జంగమహేశ్వరపాడు గ్రామ సమీపంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి వినీత్ లైఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఫార్మసీ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంటల వైపు మొగ్గు చూపడంతో కొత్తగా మొక్కజొన్న మిల్లులు ఏర్పాటు చేశారు. దీంతో వేలాది మందికి జీవనోపాధి దొరికింది. మండలంలో వివిధ సంస్థలు రావడంతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ వంటి ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. మండలంలోని అడిగొప్పుల శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ఉండడం, ఇక్కడ వందలాది మంది చిరు వ్యాపారుల తోపాటు కార్మికులు, పూజారులు జీవిస్తున్నారు. మండల పరిధిలో బుగ్గవాగు రిజర్వాయర్ కూడా ఉండడంతో మత్స్యకారులకు వరంగా మారింది. శ్రీకాకుళం వంటి ప్రాంతాల నుంచి వందలాది మత్స్యకారుల కుటుంబాలు తరలివచ్చి ఇక్కడ నివాసముండి చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని మరికొన్ని పరిశ్రమలు వచ్చేలా చూడాలని, సంస్థలకు తగు ప్రోత్సాహకాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● రోజుకు రూ.వెయ్యి సంపాదిస్తున్నా

ప్రకాశం జిల్లాలో పనుల్లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. కొంత కాలంగా దుర్గిలో జీవిస్తున్నాను. మొక్కజొన్న ఎత్తేందుకు కూలీగా వెళ్తున్నాను. రోజుకు సుమారు రూ.1000 దాకా సంపాదిస్తున్నాను.

- శ్రీపతి రమణయ్య, కార్మికుడు, దర్శి మండలం, ప్రకాశం జిల్లా

## వైసీపీ నిరసన ఉనికిని కాపాడుకోవటానికే

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్

బెల్లంకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): డీజిల్, పెట్రోల్‌పై పెరిగిన మూడు రూపాయల ధరలకు వ్యతిరేకంగా వైసీపీ నిరసనకు పిలుపునివ్వటం సిగ్గు చేటన్నారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ 2019-24 వరకు పదిసార్లు పెట్రోల్ ధరలు పెంచిన మీరు ఈ రోజు మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పెరిగిన ధరలు రాష్ట్ర నిర్ణయాల వల్ల కాదని, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం పెంచిందని తెలిపారు. మీ ఉనికిని కాపాడు కోవటానికి పనికిరాని విషయాలకు రోడ్డు మీదకు వస్తామంటే ప్రజలు అంగీకరించే పరిస్థితులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని విషయాలపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామనటం మీ దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. దేశమంతా ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఈ తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకువెళ్తున్న ఈ సమయంలో పనికి రాని ఆరోపణలు చేసి మరొకసారి ప్రజలతో ఛీ కొట్టించుకొనే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు, తమ్మిశెట్టి సత్యనారాయణ, గుడిసె కొండయ్య, ఎన్ పిచ్చయ్య, శ్రీనివాసరావు, ఓర్చు ఆనంద్, ఓర్చు రాంబాబు, గుంజా శివ పాల్గొన్నారు.

## మిర్చి పొలాల కౌలు పెంపు

● మిర్చి ధర పెరగడంతో యజమానుల నిర్ణయం

రెంటచింతల, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు ధరలను పొలం యజమానులు అమాంతంగా పెంచడంతో కౌలు రైతులకు కష్టాలు పెరిగాయి. ఈ ఏడాది మిర్చికి ఊహించిన దానికంటే అధికంగా ధర పలకడం, వర్షపాతం సాధారణంగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేయడంతో మిర్చి సాగు వైపు కౌలు రైతులు మొగ్గు చూపుతున్నారు. కిందటేడాది ఎకరాకు రూ12 వేలు ఉన్న కౌలు ఈ ఏడాది రూ.17 వేలకైతే ఇస్తాం లేదంటే లేదని భూ యజమానులు తెగేసి చెబుతున్నారు. బోర్ సౌకర్యం ఉన్న పొలానికైతే ఎకరాకు రూ.25 వేలు దాకా కౌలు ధర పలుకుతోంది. మూడేళ్ల తరువాత మిర్చికి మంచి ధర రావడంతోటే కౌలు భూములకు రెక్కలొచ్చాయి.

● కౌలు భారీగా పెరిగింది

ప్రస్తుత పరిస్థితుల్లో మిర్చికి ఆశాజనకంగా ధర లభించడంతో ఒక్కసారిగా కౌలు రేట్లు పెంచడమే కాకుండా యజమానులు ముందే కౌలు చెల్లించమంటున్నారు. పెట్టుబడులతో పాటు పురుగు మందులు,కాంప్లెక్స్ ధరలు బాగా పెరిగాయి. ఒక మందు కట్ట రూ.100 నుంచి రూ.200 ల వరకు ఉండగా డీలర్లు అదనంగా రూ.50 నుంచి 100 వరకు వసూలు చేస్తూ రైతు నడ్డి విరుస్తున్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో సేద్యపు పనులు చేసే ట్రాక్టర్లకు కూడా కిరాయిలు పెంచారు. ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధర వస్తేనే అటు రైతులకు ఇటు కౌలు రైతులకు కాస్తో కూస్తో మిగులుతాయి.



- రైతు గొట్టం నాసరరెడ్డి



దుక్కులు దున్నుతున్న రైతులు

## వార్డుల పునర్విభజన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల



డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కమిషనర్ వేణుబాబు

మాచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వార్డుల పునర్విభజన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ వేణుబాబు విడుదల చేశారు. ప్రస్తుతం పట్టణంలోని 31 వార్డులను 36 వార్డులుగా పునర్విభజన చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ప్రజల సౌకర్యార్థం, పరిపాలన అవసరాలను దృష్టిలో ఉంచుకొని వార్డుల సంఖ్యను పెంచినట్లు చెప్పారు. ప్రతిపాదిత వార్డుల వివరాలను పురపాలక సంఘ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 24వ తేదీన సాయంత్రం 5 గంటలలోగా రాత పూర్వకంగా సమర్పించాలని కోరారు.

### దాచేపల్లి నగర పంచాయతీలో..

దాచేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో 20 వార్డులను 28 వార్డులుగా రీడివిజన్ చేసి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ నగర పంచాయతీలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచురించినట్టు ఆయన తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల లోపు రాతపూర్వకంగా తెలియజేయాలని నగర పంచాయతీ కమిషనర్ కోరారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మాచర్ల రూరల్: ఆర్థికసాయం అందిస్తున్న రాజారత్నం

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు రోప్‌లైన్ కాలనీకి చెందిన గెల్లిపోగు రజని సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత అధికార ప్రతినిధి చల్లా రాజారత్నం మృతురాలి గృహానికి చేరుకొని రజని భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మూరబోయిన శ్రీహరి యాదవ్, బత్తుల దుర్గ, వేముల సాయి, గెల్లిపోగు దానియేలు, ఆలేటి నాగరాజు, యాకోబు, దాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పూజల కోటేశ్వరరావు సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడు కోటేశ్వరరావు గృహానికి టీడీపీ నేతలు చేరుకొని రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కోటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొల్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బొమ్మిన శేషగిరి, మునుగోటి సత్యం, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, పల్లె రవి పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

సీపీఐ నేతల డిమాండ్



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దాచేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ, పశు, వైద్య, ఉద్యాన, మత్స్య విశ్వ విద్యాలయాలకు రెగ్యులర్ వైస్ చాన్సలర్‌లను నియమించాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ, విద్య, పరిశోధన విస్తరణ సేవలు, పశు వైద్యం అభివృద్ధి, ఉద్యానవన పురోగతి, మత్స్య సంపద వృద్ధి, గ్రామీణ నవకల్పన, ఆహార భద్రత బలోపేతం చేయటంలో ఆయా విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీసీ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్‌లు, తాత్కాలిక ఏర్పాట్లు లేదా ఖాళీలు దీర్ఘకాలం కొనసాగటం వల్ల విధాన నిర్ణయాల్లో లోపాలు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేసిన వారిలో కందిమళ్ళ సైదారావు, తెలనాకుల సత్యనారాయణ, సయ్యద్ సైదా, శ్రీపతి కోటేశ్వరరావు, పత్తిపాటి నాగరాజు, మురికపూడి సరవయ్య, భూక్యా నరసింహా నాయక్ తదితరులు ఉన్నారు.

## వరి చేలో వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దు

● ఏవో కట్టా లక్ష్మారెడ్డి

రెంటచింతల, మే 18 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు పూర్తయ్యాక వరిగడ్డిని తగలపెట్టడం వలన భూసారం తగ్గిపోతుందని రైతులు తమ చేజేతులా మిత్రపురుగులను సూక్ష్మజీవులను హరిస్తున్నారని ఏవో కట్టా లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఏడుమంగళం వాగు ఒడ్డున ఉన్న వరి పొలంలో మిగిలిన అవశేషాలను దహనం చేయడాన్ని తప్పుపట్టారు. పొలాల్లో మిగిలిన గడ్డిని తగలపెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి మనుషులు, జంతువులు, పక్షుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్న విషయాన్ని అన్నదాతలు గమనించాలని కోరారు. వరిగడ్డి సహజంగా కుళ్ళిపోయేందుకు అందుబాటులో వున్న డీకంపోజర్‌లను ఉపయోగించాలని, ఈ విధానం ద్వారా నేల సారవంతం కావడమే గాకుండా ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు.



ఏడుమంగళం వాగు ఒడ్డున తగలపెట్టిన వరి మాగాణి

## పెట్రోలు, డీజిల్ ధరలపై వైసీపీ నిరసన

పిడుగురాళ్ళ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పిడుగురాళ్లలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసీపీ కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి డీటీ సుధాకరశర్మకు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): పెరిగిన పెట్రోల్, డీసిల్ ధరలను తగ్గించాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో పెదకూరపాడులో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల సమయంలో పెరిగిన పెట్రోల్, డీసిల్ ధరలను తగ్గిస్తామని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీసిల్ ధరలను పెంచారని వైసీపీ నేతలు అన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, ఈదా సాంబిరెడ్డి, మండల వైసీపీ నాయకులు బచ్చు హనుమంతరావు, వేమవరపు నాగేశ్వరరావు, కంచర్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల: రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

● మాచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు, డీజిల్ ధరల పెంపును తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీ వాణికి వినతిపత్రం అందించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ జరిపారు. ర్యాలీనుద్దేశించి పీఆర్కే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రజలపై మరింత భారం మోపడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు అబ్దుల్ జలీల్, సంతోష్, ఓరుగంటి చిన్నా, బూదాల మరియమ్మ, బొమ్మిరెడ్డి సుబ్బారావు, యరబోతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహాలకు పంపిణీ చేస్తున్న నీటి పరీక్ష కిట్లు

# నీటి పరీక్షతో రక్షణ

● వసతి గృహాల్లో నీటి పరీక్షకు ప్రత్యేక కార్యాచరణ
● ఆయా వసతి గృహాలకు చేరిన నీటి పరీక్షల కిట్లు

సత్తెనపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో తరచూ తాగునీటి కలుషితంపై ఏదో ఒక చోట వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇక మీదట అలాంటి సమస్య లేకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుంది. ప్రత్యేకించి సంక్షేమ వసతి గృహాల్లో అందజేసే మంచి నీటిని అక్కడే పరీక్ష చేసే విధంగా చర్యలు చేపట్టింది. దీనివల్ల సమస్యలు రాకుండా ముందుగానే నివారించే వీలు కలుగుతుంది. సంక్షేమ వసతి గృహాల్లో సరఫరా చేసే నీటిని వసతి గృహ సంక్షేమ అధికారులే నీటిని టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇది వరకు తాగు నీటి సమస్య వస్తే గ్రామీణ నీటి సరఫరాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపి శాంపిళ్ల పరీక్ష చేయించే వారు. అక్కడ వచ్చిన నివేదిక ఆధారంగా అధికారులు తగుచర్యలు తీసుకొనే వారు. ఇక మీదట అలాంటి పరిస్థితి ఉండదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు కిట్లను పంపిణీ చేశారు. వసతి గృహ సంక్షేమ అధికారులకు ఈ కిట్లను ఎలా ఉపయోగించాలనే విషయాలపై శిక్షణ ఇచ్చారు.

# ఉద్యాన రైతుకు ఊతం



భట్టిప్రోలు లంక ప్రాంతాల్లో వేసిన జామతోటలు

● హార్టికల్చర్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
● కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం ఆర్థిక సాయం
● ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు అర్హులు
● నిరంతరంగా దరఖాస్తుల స్వీకరణ



కొల్లూరు ప్రాంతంలో ప్రభుత్వ రాయితీపై ఏర్పాటు చేసిన తేనెటీగల పెంపకం

వేమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన సాగును విస్తరింపజేసేందుకు కూటమి ప్రభుత్వ ప్రత్యేక దృష్టి పెట్టింది. భారీగా రాయితీలు అందించేందుకు కేంద్రంతో కలిసి చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్రం 60 శాతం మేర ఆర్థిక సహాయం అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాయి. దాంతో రైతులు ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

**● రాయితీలు ఇలా..**

పండ్ల తోటలు వేసే వారికి 40 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. అరటి తోటలు వేసే వారికి హెక్టారుకు రూ.70 వేలు, జామతోటలు వేసే వారికి హెక్టారుకు రూ.80 వేలు, నిమ్మతోటలకు హెక్టారుకు రూ.50 వేలు రాయితీ అందజేస్తోంది. బొప్పాయి తోటలకు హెక్టారుకు రూ.30 వేలు, పూలతోటలకు హెక్టారుకు రూ.20 వేలు, కూరగాయ తోటలకు హెక్టారుకు రూ.24 వేలు, నిమ్మతోటలకు హెక్టారుకు రూ.24 వేలు రాయితీ అందజేస్తోంది. అలాగే గతేడాది నుంచి ఆయిల్ పామ్ మొక్కలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. రూ.133 ధర కలిగిన దేశవాళీ మొక్క రూ.173 ధర కలిగిన విదేశీ మొక్కలను ఉచితంగానే అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం తోటల యాజమాన్యం అంతర పంటలకు హెక్టార్‌కు రూ.10,500 చొప్పున, నాలుగు సంవత్సరాల పాటు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. కొబ్బరి తోటలు వేసుకునే రైతులకు హెక్టారుకు రూ.56 వేలు, తీగలతో కూడిన తోటలు వేసుకునే రైతులకు శాశ్వత పందిళ్ల నిర్మాణానికి హెక్టారుకు రూ.2.50లు రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. తేనెటీగల పెంపకానికి ప్రతి ఏటా బాక్సుకు రూ.1.20 లక్షలు ప్రభుత్వ రాయితీ లభిస్తోంది. పండిన పండ్లు రవాణా చేసేటప్పుడు దెబ్బతినకుండా ఫ్రూట్ కవర్లను 50 శాతం రాయితీపై అందజేస్తుండగా, పుట్టగొడుగుల పెంపకానికి రూ.లక్ష సబ్సిడీని అందిస్తోంది. పసుపు తోటల రైతులకు హెక్టారుకు రూ.40 వేలు రాయితీని ప్రభుత్వం అందజేస్తోంది.



రాయితీపై వేసిన అరటి తోటలు



లంక ప్రాంతాల్లో నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు

**● సోలార్ డ్రయ్యర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం**

కూరగాయలు, పండ్లు ఎండబెట్టుకునే రైతులకు సోలార్ డ్రయ్యర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రూ.3.50 లక్షలు విలువ చేసే డ్రయర్లకు రూ.1.20 లక్షలు రాయితీ అందిస్తోంది. పురుగు మందులు స్ప్రే చేసేందుకు తైవాన్ స్ప్రేయర్‌లను రూ.26 వేలు ఖరీదు కలిగిన దానిని 50 శాతం రాయితీపై అందజేస్తోంది. ఎలక్ట్రిక్ మోటార్ల ఏర్పాటుకు రూ.10 వేలు రాయితీ ఇస్తుంది.

**● నిరంతరం దరఖాస్తుల స్వీకరణ**



ఉద్యానవనశాఖ అందించే రాయితీలు పొందేందుకు రైతులకు నిరంతరం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోత్సాహకాలు అందుకునేందుకు గ్రామాల పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయల్లో ఉద్యాన శాఖ సిబ్బంది ద్వారా దరఖాస్తులు పొందొచ్చు. సంబంధించిన సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి దరఖాస్తులను తీసుకుంటారు. రాయితీ పొందేందుకు ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే అర్హులు. దరఖాస్తుదారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు ఫొటోను జతపరిచి ఇవ్వాలి. అర్హులకు రాయితీలను నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తాం.

**-ఉద్యానవనశాఖ ఏవో కల్యాణ చక్రవర్తి**

# భవన నిర్మాణ కార్మికుడికి భరోసా

● వారి పథకాలను పునరుద్ధరించిన ప్రభుత్వం

క్రోసూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికు లకు ప్రభుత్వం అన్ని రకాల పథకాలను పునరుద్ధరించింది. వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల పథకాలు తిరిగి అందుబాటులోకి తెచ్చారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.60 వేలు నగదు అందుతుంది. మరణం తరువాత కుటుంబ సభ్యులు ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అంత్యక్రియల ఖర్చులకు రూ.20వేలు అందిస్తారు. భవన నిర్మాణ మహిళా కార్మికులకు రూ.20వేలు వివాహ కానుకగా వారి ఖాతాల్లో జమ చేస్తారు. పెళ్ళి అయిన తేదీ నుంచి ఆరు నెలలలోపు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. కార్మికురాలు లేదా కార్మికుడి భార్య రెండు ప్రసవాల వరకు ప్రయోజనాలు అందిస్తారు. ఒక్కో ప్రసవానికి రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. దీనికి కూడా ప్రసవం జరిగిన ఆరు నెలలలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకా లన్నీ వర్తించాలంటే భవన నిర్మాణ రంగంలో పని చేసి 18 నుంచి 60 సంవత్సరాలలోపు వారై ఉండాలి. కార్మికశాఖ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలి. గుర్తింపు కార్డులు పాతవి ఉంటే రెన్యూవల్ చేసుకోవాలి. కార్డు ఉంటేనే పథకాలు వర్తిస్తాయి.



# పంచాయతీలను పిండేశారు

(5వ పేజీ తరువాయి)

కొందరు వారితో కుమ్మక్కయ్యారు. మరికొందరు తమకెందుకు అన్నట్లు మిన్నకుండి పోయారు.

**నిబంధనలు బేఖాతరు**

పంచాయతీ ఖర్చులపై.. అసలు ఆడిటింగ్ జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రూల్స్‌ను 2002లో 441 జీఓ కింద విడుదల చేశారు. ఒక పంచాయతీలో చిన్న మొత్తమైనా.. పంచాయతీ ఖాతా చెక్ ద్వారానే జరపాలి. ఓచర్లు, రసీదులు ఉపయోగించడానికి వీల్లేదు. రూ.50 వేలకు మించిన పనిని.. టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించాలి. ఎంత పెద్ద వర్క్ అయినా.. ఒకే టెండర్ ద్వారా అప్పగించాల్సిందే. కానీ, కొన్ని పంచాయతీల్లో రూ.లక్ష విలువ వర్క్ కూడా.. నాలుగైదు ముక్కలు చేసి పంచేసుకున్నారు. రూ. 10 వేలకు మించి చెల్లింపులు ఉంటే ఉన్నతాధికారి కౌంటర్ సంతకం తప్పనిసరి. కొన్ని పంచాయతీల్లో అసలు పంచాయతీ కార్యదర్శి సంతకమే లేదు. రూ. 25వేలకు పైన జేసీబీతో పనిచేయిస్తే ఎం బుక్ తప్పనిసరి. పారిశుధ్య నిర్వహణలో ట్రాక్టర్ ఉపయోగిస్తే ఆయిల్ లెక్కలకు లాగ్ బుక్ ఉండాలి. ఇవేమీ చాలా పంచాయతీల్లో లేవు. విద్యుత్తు పరికరాలు కొనుగోలు చేస్తే ఎస్.ఎస్.ఆర్ ప్రకారం ఉన్న రేట్లకు లోబడే కొనుగోలు చేయాలి. కానీ, ఎస్.ఎస్.ఆర్‌తో పనిలేకుండా దానికి రెట్టింపు రేట్లకు వీధి దీపాలు కొనుగోలు చేసిన పంచాయతీలున్నాయి. పారిశుధ్య నిర్వహణకు రూ.2 లక్షలు, మురుగు కాల్వల పూడికతీతకు రూ.5 లక్షలు, ఎక్స్‌కవేటర్‌తో పనిచేయించినందుకు రూ.3.5 లక్షలు... ఇలా సొంత డబ్బు ఖర్చు చేస్తే.. గుర్తుకోసం కాగితంపై ఎలా నమోదు చేసుకుంటామో! అదే తీరులో బిల్లులు లేకుండా 2025 సంవత్సరం పంచాయతీ జమా ఖర్చుల రికార్డులు ఉన్నాయంటే విస్తుకలిగించే అంశం.

**తనిఖీకొస్తే రూ.10వేలు, ఫుల్ ట్యాంక్ ఆయిల్**

పంచాయతీల నిర్వహణ, నిధుల ఖర్చుపై ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించాలి. ఈఓపీఆర్‌డీ నెలవారీ, డివిజన్ స్థాయి అధికారి మూడు మాసాలకోసారి, జిల్లా స్థాయి అధికారి 6 నెలలకొకసారి ప్రతి పంచాయతీని తనిఖీ చేయాలి. బిల్లులు, ఎం బుక్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలి. కలెక్టర్, జేసీ కూడా అవకాశం ఉన్నప్పుడల్లా సడెన్ విజిట్‌తో రికార్డులు పరిశీలించడం పరిపాటి. గతంలో తనిఖీలకు సంబంధించి టార్గెట్ ఉండేది. ఈఓపీఆర్డీ నెలలో 8 నుంచి 15, ఎంపీడీఓ 4 నుంచి 10 పంచాయతీలు తనిఖీ చేయాలి. ఇప్పుడు తనిఖీలు మొక్కుబడిగానే మిగిలిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో తనిఖీలు మాటే మర్చిపోయారు. డీఎల్‌పీఓ, డీపీఓలు తరచూ తనిఖీలు నిర్వహించినట్లు మాత్రం రికార్డుల్లో సంతకాలు కనిపిస్తున్నాయి. ఏ అధికారి అయినా ఒకసారి పంచాయతీకి తనిఖీకి వస్తే రూ.10వేలు నగదు, కారుకు ఫుల్ ట్యాంక్ ఆయిల్ నింపి ఇవ్వాలనే అనధికార షరతులు ఉన్నాయని అధికారులే చెబుతున్నారు. సంవత్సరంలో ఇద్దరు ఉన్నతాధికారులు పది సార్లు పంచాయతీకి వస్తే రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఇచ్చుకోవాలని, ఆయిల్‌కు మరో రూ. లక్షపైన ఖర్చు తప్పదని చెబుతున్నారు. దీనిపై కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలను ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే.. తాము పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘాల్లో కీలక పదవుల్లో ఉన్నామంటూ బెదిరింపులకు దిగుతున్న పరిస్థితి కూడా ఉంది.

**చర్యలు తీసుకునేనా..**

కూటమి ప్రభుత్వంలో కూడా.. ఒకరిద్దరు ఉద్యోగ సంఘాల నాయకులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని సమాచారం. వారిపై చర్యలకు ఉన్నతాధికారులు ఉపక్రమిస్తే.. కింది నుంచి పై స్థాయి వరకు అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని చెప్పి, ఎటువంటి చర్యలు లేకుండా చక్రం తిప్పుతున్నారనే ఆరోపణ ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారుల పంచాయతీల్లో ఆడిట్ నిర్వహిస్తే భారీగా నిధుల గోల్‌మాల్ గుట్టు బయటపడే అవకాశం ఉంది.

# పెట్రోల్ ధరల పెంపుపై వైసీపీ ధర్నాలు హాస్యాస్పదం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పెంపుపై వైసీపీ ధర్నాలు చేపట్టడం హాస్యాస్పదమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో రైతులకు వడ్డీలేని రుణాల పంపిణీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రంలో పెట్రోల్ రూ.76, డీజిల్ రూ.68 ఉందని, కేవలం ఏడాది కాలంలోనే 2020 నాటికి పెట్రోల్‌ను రూ.107, డీజిల్‌ను రూ.99కి చేర్చి లీటరుకు రూ.31 పెంచి ప్రజల నడ్డి విరిచిన జగన్ రెడ్డికి ఇంధన ధరల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. నాడు అధికార స్వార్థంతో రోడ్డు సెస్, వ్యాట్, అదనపు వ్యాట్ అంటూ రకరకాల పన్నుల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిన ఘనత గొడ్డలి పార్టీదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో రాష్ట్ర ప్రజలపై రూపాయి కూడా అదనపు పన్ను వేయకుండా బాధ్యతగా పాలిస్తోందన్నారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి గత వారం కేవలం రూ.3 మాత్రమే పెరిగితే, దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదిస్తూ జగన్ డ్రామాలు ఆడటం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ పిలుపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఇంధన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఇంధన పొదుపులో భాగంగానే రాష్ట్రంలో భారీ ఎత్తున సోలార్ విద్యుత్తును ప్రోత్సహిస్తున్నామని, సామాన్యులపై భారం పడకుండా కరెంటు చార్జీలు కూడా పెంచకుండా పాలిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని జీవీ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

# బడిలో స్వచ్ఛ జలం

(5వ పేజీ తరువాయి)

మరమ్మతులు, ఇన్‌స్టలేషన్‌పై దృష్టి సారించారు.

**నిబంధనలు ఇలా..**

కాంట్రాక్టు సంస్థలు పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన నాటి నుంచి ఐదేళ్ల పాటు నిర్వహణ, మరమ్మతులు పర్యవేక్షించాలి. అయితే కాంట్రాక్ట్ సంస్థలు ఇన్‌స్టలేషన్ చేసి.. చేతులు దులుపుకున్నాయి. మరమ్మతుల అసలు పట్టించుకోలేదు. ఉన్నత స్థాయి ఒత్తిళ్ల కారణంగా గత పాలకులు దీని గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పాఠశాలల్లో నాటి వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన నాడు నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పనుల్లో లోపాలు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేశారు. ప్రధానంగా ఆర్వోప్లాంట్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నట్లు తేలింది. దీంతో వాటికి మరమ్మతులు చేయడంతో పాటు, ఇప్పటికే పాఠశాలలకు చేరిన ఆరో ప్లాంట్లను ఇన్‌స్టలేషన్ చేయించేందుకు కాంట్రాక్ట్ సంస్థలపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కొన్ని రోజుల నుంచి పాఠశాలల్లో ఉన్న ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి.

# ఉద్యోగం ఆశ చూపి.. అక్రమ రవాణా

● ఏడాదిగా బ్యాంకాక్‌లో యువతి నిర్బంధం
● తమ కుమార్తెను కాపాడాలని తల్లిదండ్రుల వేడుకోలు

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తెకు ఉద్యోగం ఆశ చూపి అక్రమంగా విదేశాలకు తీసుకెళ్లి అక్కడ నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని బాధిత యువతి తల్లిదండ్రులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి బ్యాంకాక్ తీసుకెళ్లిన సత్తెనపల్లికి చెందిన ఇరువురు బంగారు వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చేబ్రోలు మండలం చీలి పాలెం ప్రాంతానికి చెందిన దంపతుల కుమార్తెకు వివాహం కాగా భర్తను వదిలి 2025 సంవత్సరం నుంచి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు సత్తెనపల్లికి చెందిన బంగారు వ్యాపారులు పెరుమాళ్ళ సుబ్బారావు, సూర్య అనే ఇరువురు పరిచయమయ్యారు. బ్యాంకాక్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, అక్కడ ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి వారిరువురూ ఆమెను అక్కడకు తీసుకువెళ్లి నిర్బంధించారు. తాము చేస్తున్న దొంగ బంగారం వ్యాపారానికి సహకరించాలని వేధించారు. అందుకు తమ కుమార్తె ఒప్పుకోకపోవడంతో తనపై తప్పుడు కేసు బనాయించి ఇరికించారు. దీనిపై అక్కడి కోర్టు విచారించి ఆ కేసు నుంచి తమ కుమార్తెను నిర్దోషిగా ప్రకటించింది. కానీ ఆమెను ఇండియాకు తీసుకురాకుండా అక్కడే నిర్బంధించి వేధింపులకు గురి చేశారు. తమ కుమార్తెను అక్రమంగా విదేశాలకు తరలించి ఆమెను వేధించిన సుబ్బారావు, సూర్యలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు ఎస్పీని కోరారు. తమ కుమార్తెను ఇండియాకు రప్పించి తమకు అప్పగించాలని వేడుకున్నారు.

# విదేశాలకు పంపిస్తామని మోసం

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్న తనను విదేశాలకు పంపిస్తామని ఆశ కల్పించి రూ.10 లక్షలు తీసుకొని ఒక కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకులు మోసం చేశారని బాధితురాలు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను ఎంబీఏ పూర్తి చేసి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని, తను విదేశాలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో యాసిన్ అనే వ్యక్తి తనను సంప్రదించి తనను పోలాండ్ పంపిస్తానని చెప్పాడని తెలిపారు. తాను, రచన అనే ఇరువురం నైలా అబ్రాడ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నామని, తమ సంస్థ హైదరాబాద్, విజయవాడలో ఉందని త్వరలో గుంటూరులో కూడా బ్రాంచ్ ప్రారంభించబోతున్నామని చెప్పారన్నారు. తనకు పోలాండ్‌లో ఇప్పిస్తామని చెప్పి రూ. 12 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారన్నారు. దశలవారీగా రూ.10లక్షలు తీసుకోవడంతో పాటు తాను పనిచేస్తున్న ఉద్యోగానికి కూడా రాజీనామా చేయించారన్నారు. అయితే నెలలు గడుస్తున్నా తనకు వీసా రాకపోవడంతో వారిని ప్రశ్నించగా కొద్దిరోజులు కాలయాపన చేసి ఆ తర్వాత ఫోన్ తీయడం మానేశారన్నారు. దీంతో విజయవాడలోని కార్యాలయానికి వెళ్లగా దానిని మూసివేసినట్లు అక్కడివారు చెప్పారన్నారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి యాసిన్, రచన పరారయ్యారని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.

# సీఆర్డీఏ కార్యాలయాన్ని సందర్శించిన యువ సంగం బృందం



సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మహారాష్ట్ర విద్యార్థి సంగం బృందం

తుళ్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్ర నుంచి విచ్చేసిన యువ సంగం విద్యార్థి బృందం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం సందర్శించింది. ఈ బృందం సీఆర్డీఏ కార్యాలయంలోని అమరావతి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఏపీ సీఆర్డీఏ అధికారులు రాజధాని అమరావతిని రైతుల భాగస్వామ్యంతో ఏ విధంగా ప్రణాళికా యుతంగా నిర్మిస్తున్నారో భారీ స్క్రీన్‌పై వారికి వివరించారు. అనంతరం యువ సంగం బృందంతో కమిషనర్ విజయరామరాజు మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణంపై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ మేరకు రాజధాని పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు కమిషనర్ వివరించారు.

# వార్డులు పెంచారు

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉంది. కానీ, కొత్తగా వార్డుల విభజన చేస్తామని, ప్రజల సూచనలు తీసుకుంటామని ప్రభుత్వం తరపున కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే.. పాత పిటిషన్లు రద్దు చేసే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఎన్నికలు జరగని కారణంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మూడు విడతలుగా నిలిచిపోయాయి. నరసరావుపేట మునిసిపాలిటీ.. ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.16.59 కోట్లు కోల్పోయింది.

**ఎన్నికలకు సమాయత్తం..**

ప్రభుత్వం కూడా మునిసిపాలిటీలకు, పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రకటించిన విషయం తెలిసిందే. మునిసిపాలిటీల్లో వార్డుల పునర్విభజన తుది ప్రకటన వెలువడిన వెంటనే.. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించాల్సి ఉంది. అలాగే రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను కూడా చేపట్టేందుకు పుర అధికారులు సిద్ధమవుతున్నారు. నూతన వార్డుల ముసాయిదాను రాజకీయ పార్టీలు కూడా నిశితంగా పరిశీలిస్తున్నాయి.

**సందిగ్ధంలో చిలకలూరిపేట**

చిలకలూరిపేట మునిసిపాలిటీలో వార్డుల పునర్విభజన ముసాయిదాను ప్రకటించలేదు. ఇక్కడ 38 వార్డులను 48కి పెంచాల్సి ఉంది. గత ఎన్నికల ముందు గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం పంచాయతీలను మునిసి పాల్టీలో విలీనం చేశారు. రాజకీయ కారణాలతో ముసాయిదాను సోమవారం సాయంత్రం వరకు వెల్లడించలేదు. విలీన గ్రామస్థులు కొందరు మునిసిపాలిటీలో ఉంచాలని.. ఇంకొందరు పంచాయతీలుగానే ఉంచాలని కోరుతూ కోర్టులో పిటిషన్‌లు వేశారని అధికారులు చెబుతున్నారు. దీంతో విలీన గ్రామాలు కలిపి ఒకటి, కలపకుండా మరొకటి ఇలా.. వార్డుల పునర్విభనకు రెండు ముసాయిదాలను మునిసిపల్ అధికారులు సిద్ధం చేశారు. తాము చెప్పే వరకు వార్డుల పునర్విభజనను వెల్లడించవద్దని మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు కమిషనర్‌ను ఆదేశించడంలో జాబితాను వెల్లడించలేదు.

# శీతల గిడ్డంగులు ఖాళీ

(5వ పేజీ తరువాయి)

యాజమాన్యాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేవి. ఈ సంవత్సరం ఆ పరిస్థితి ఏ ఒక్క కోల్డ్ స్టోరేజ్ లోనూ కనిపించడం లేదు. గతేడాది తక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగు చేయడం, సీజన్‌లోనే రైతులు చాలా వరకు మిరపకాయలను విక్రయించేయడంతో ఇప్పుడు శీతల గిడ్డంగులు వెలవెలబోతోన్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లోని స్టోరేజ్‌లలో 50 శాతం వరకు నిండగా.. గుంటూరులో పరిస్థితి దారుణంగా ఉంది. కేవలం 25 శాతం మాత్రమే ఇప్పటి వరకు నిండాయి. దీంతో ఆయా గిడ్డంగులకు నిర్వహణ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

**గడ్డుకాలం**

కోల్డ్‌స్టోరేజ్‌లన్ని ఈ ఏడాది గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. రెండేళ్ల క్రితం నిల్వ చేసిన బస్తాలకు యాజమాన్యాలు గ్యారెంటీర్‌గా ఉండి రైతులు, స్టాకిస్టులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాయి. అయితే వాటికి అద్దెలు పెరిగిపోవడంతో తీసుకెళ్లడానికి రైతులు రావడం లేదు. దీంతో బ్యాంకులు రుణాలు చెల్లించమని కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడిని పెంచుతున్నాయి. మరోవైపు ఒక్కో కోల్డ్‌స్టోరేజ్‌కు ప్రతి నెలా కరెంటు బిల్లు, సిబ్బంది జీతభత్యాలు, ఆరు నెలలకు ఒకసారి మునిసిపల్ ట్యాక్స్ వంటివి రూ.లక్షల్లో చెల్లించాలి. దీంతో వర్కు అవుట్ కాక దాదాపుగా 15 కోల్డ్‌స్టోరేజ్‌లను వాటి యజమానులు అమ్మకానికి పెట్టారు.

**వ్యవసాయ పరిశ్రమగా గుర్తించాలి**



కోల్డ్‌స్టోరేజ్‌లన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటైనవి. వాటికి ఇప్పుడు ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వవు. కేంద్ర ప్రభుత్వం వీటిని మైక్రో ఇండస్ట్రీస్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పరిశ్రమగా పరిగణిస్తే తమకు ప్రతి నెలా రూ. లక్షల్లో వస్తున్న విద్యుత్ బిల్లు తగ్గిపోతుంది. కొంతవరకు పరిశ్రమ నిలదొక్కుకుంటుంది.

**-సురేంద్రబాబు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానుల సంఘం నేత**

**ప్రతి నెలా రూ.6 లక్షల ఖర్చు**



కోల్డ్ స్టోరేజ్‌కు ప్రతి నెలా రూ.3 లక్షల వరకు కరెంటు బిల్లు వస్తుంది. చాంబర్ల వారీగా ఎయిర్ కండీషనింగ్ సదుపాయం ఉండదు. అంతా కలిపి ఒకటే యూనిట్ ఉంటుంది. సిబ్బంది జీత భత్యాలు రూ.2.50 లక్షలు, ప్రతి ఆరు నెలలకు మునిసిపల్ ఆస్తి పన్ను రూ. 3 లక్షలు చెల్లించాలి. పంచాయతీ పరిధిలో అయితే ఏడాదికి రూ.65 వేలు ఆస్తి పన్ను ఉంటుంది. ఈ ఖర్చులన్నీ భరించలేకపోతున్నాం.

**-కర్లపూడి వెంకటేశ్వరరావు, కోల్డ్‌స్టోరేజ్ యజమాని**

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11226, 99854 11220
99852 07026

## చిలకలూరిపేటలో నిలిచిన వార్డుల పునర్విభజన

చిలకలూరిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. మున్సిపాలిటీలో గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామాలు విలీనమై ఉన్నాయి. గణపవరం, పసుమర్రు గ్రామాలకు చెందిన వారు కొందరు తమ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలోనే ఉంచాలని, మరికొందరు పంచాయితీలుగానే ఉంచాలని హైకోర్టులో కేసులు వేశారు. ఈ కేసులు విచారణ దశలో ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు మునిసిపల్‌శాఖ ఈ విషయంపై తుది నిర్ణయం గైకొంటుందని సమాచారం. విలీన గ్రామాల సమస్యపై ఏ నిర్ణయం తీసుకున్నా మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య 38 నుంచి 48కి పెరగడం మాత్రం ఖాయం.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

వినుకొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పురపాలక సంఘం పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 22 వరకు పట్టణంలోని శాలివాహననగర్ -1, మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని లాయర్స్ స్ట్రీట్-2 సచివాలయాల్లో ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

## అన్న క్యాంటీన్లను పరిశీలించిన టీడీపీ నాయకులు

చిలకలూరిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్లను స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచన మేరకు సోమవారం సందర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.చిన బాబు, టీడీపీ నాయకులు సయ్యద్ వహాబ్ తదితరులు మూడు క్యాంటీన్లలో పరిస్థితిని పరిశీలించి అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

వినుకొండటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) తన సహచరితో మాట్లాడించాలంటూ ఓ యువకుడు నరసరావుపేట రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి పోలీసులను డిమాండ్ చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బొల్లాపల్లి మండలం కనమలచెరువు గ్రామానికి చెందిన కాటంరాజు పెయింటర్. కాటంరాజు వినుకొండకు చెందిన సృజనను ప్రేమించి సహజీవనం చేశాడు. వారి ఒక కుమార్తె. తదనంతరం కృష్ణా జిల్లా బందరుకు చెందిన ధనలక్ష్మితో కూడా సహజీవనం చేశాడు. ఆమెకు పాప జన్మించింది. ఈ సందర్భంలో సృజన కాటంరాజును విడిచి పుట్టింటి చేరింది. ఆమె తల్లిదండ్రులు కూడా కాటంరాజుతో మాట్లాడటకపోవటంతో అతను టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. సీఐ బ్రహ్మయ్య కాటంరాజును ఫోన్‌లో సంప్రదించి నచ్చచెప్పటంతో టవర్ నుంచి కిందకు దిగాడు. అనంతరం సృజనను పోలీసులు పిలిపించి మాట్లాడించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు రూరల్ సీఐ తెలిపారు.

## ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 68ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పలనాడు జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పాల్గొన్నారు. వివిధ అంశాలపై మొత్తం 68 ఫిర్యాదులు వచ్చాయి.

## హోంగార్డుల కుటుంబానికి ఆర్థిక సాయం

నరసరావుపేట లీగల్, మే 18, (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్టీవో కార్యాలయంలో హోంగార్డుగా సేవలందిస్తూ గత ఏడాది డిసెంబరు 4న పాముకాటుతో మృతి చెందిన ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు జిల్లాలోని హోంగార్డులు వారి ఒకరోజు వేతనం రూ.5లక్షలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్ ప్రభాకరరావు సతీమణి జ్యోతికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ పాల్గొన్నారు.

## దోమలగుండం అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

బొల్లాపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోమలగుండం అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం నుంచి బడికి వెళ్ళే పిల్లల శారీరక, మానసిక, బుద్ధి వికాసం, గణితం తల్లిదండ్రుల సమక్షంలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 23 నుంచి కంభంపాడులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

నూజెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండంలోని కంభంపాడులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి క్రికెట్ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి విజేతకు రూ 30,116లు, రెండవ విజేతకు రూ 20,116లు, మూడవ బహుమతి రూ 15,116లు, నాల్గవ బహుమతి రూ 10,116లతో పాటు ట్రోఫీలు అందజేసినట్లు తెలిపారు. వివరాలకు 9502507509, 9014324697లో సంప్రదించాలన్నారు.

## యోగా శిక్షణ ప్రారంభం

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో యోగా శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైందని నిర్వాహకులు జల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 42 అసనాలు ఆహార నియమాలు, సూర్యనమస్కారాలు నేర్పిస్తామన్నారు. మరో ఐదు రోజులపాటు కొత్తవారు చేరడానికి అవకాశం ఉందన్నారు.



విద్యుత్ వైర్లు లేని నూతన విద్యుత్ స్తంభాలు

# స్తంభాలు వేశారు.. తీగలు మరిచారు..!

● అధికారులు పట్టించుకోకపోవటంపై ఆగ్రహం ● గుత్తేదారుల అలసత్వంపై గ్రామస్థుల అసహనం

వినుకొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పుకొండ తండాలో విద్యుత్ శాఖ అధికారులు పాత విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటులో అలసత్వంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రతి వీధికి వీధిలైట్లు ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా గత కొంతకాలం క్రితం సుమారు 30కు పైగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. గుత్తేదారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి కొన్ని స్తంభాలకు నూతన విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయడం మరచిపోయారు. ఈ విషయంపై గ్రామస్థులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులతో పాటు గుత్తేదారులను ప్రశ్నించినప్పటికీ నేటికీ విద్యుత్ వైర్లు బిగించలేదు. అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తండాలో మొట్టమొదటి సారిగా పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించినప్పటికీ మండలంలో విద్యుత్ శాఖ పనులు నిర్వహిస్తున్న గుత్తేదారులు వైసీపీకి అనుకూలంగా ఉంటూ తండాలో పనులు చేసేందుకు ఇష్టంలేకనే నూతన వైర్లను ఏర్పాటు చేయడంలో తీవ్ర అలసత్వం వహిస్తున్నారని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామ ప్రారంభంలోని రెండు వీధులకు ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ స్తంభాలకు విద్యుత్‌వైర్లను బిగించి గ్రామంలో విద్యుత్ సమస్యలను తొలగించాలని వారు కోరుతున్నారు.

# కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ● రైతులకు రూ.30.33 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. సోమవారం వినుకొండ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 18మంది రైతులకు, వారు నిలువ చేసుకున్న ధాన్యం ఆధారంగా రూ. 30.33లక్షల వడ్డీలేని రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పంట చేతికి రాగానే మార్కెట్లో తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే మార్కెట్ యార్డు గిడ్డంగిలో ధాన్యం భద్రపరుచుకునే సదుపాయాన్ని కల్పించామని, అలా నిలువ చేసుకున్న రైతులకు తక్షణ పెట్టుబడి ఖర్చుల కోసం వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ పెద్ద మొత్తంలో రుణసాయం అందించి అండగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకూడదనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకప్పుడు కరవు పీడిత ప్రాంతంగా ముద్రపడిన పల్నాడు, వినుకొండ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని ఆయకట్టుకు చివరి భూములకు సైతం సాగునీరు అందేలా కాలువల మరమ్మతులు, ఆధునీకరణ పనులను వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్, వైస్ చైర్మన్ కాళంగి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు జగ్గారావు, వంకాయలపాటి పేరయ్య, లగడపాటి వెంకట్రావు, రావెళ్ల బుజ్జి, మాదినేని ఆంజనేయులు, డీసీ కొండలు, విశ్వనాథం, గురవయ్య మాస్టార్‌తో మార్కెట్ యార్డు డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈవీ ఆటోలో జీవీ ప్రయాణం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంధన పొదుపులో భాగంగా తన కాన్వాయ్‌ని కుదించిన నేపథ్యంలో చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తన కాన్వాయ్ వాహనాలను ఆపి ఎలక్ట్రానిక్ ఆటోలో సామాన్యుని వలె మార్కెట్ యార్డుకు చేరుకోవడంతో రైతులు, ఆ పార్టీ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలదేనని, పర్యావరణ పరిరక్షణకు, ఇంధన ఖర్చులను తగ్గించుకోవడానికి విద్యుత్ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.



రైతులకు చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



రోడ్డు పనులు పరిశీలించేందుకు సైకిల్‌పై వస్తున్న చీఫ్‌విప్ జీవీ

### రోడ్డు నిర్మాణ నాణ్యతలో రాజీవద్దు: జీవీ

ఈపూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలకు రాజీ పడవద్దని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని బోడెపూడివారిపాలెం నుంచి కనమర్లపూడి వరకు రూ.2.50 కోట్లతో నిర్మాణం చేపట్టిన తారురోడ్డు పనులను సోమవారం జీవీ పరిశీలించారు. రోడ్డు పనులు పరిశీలించేందుకు వినుకొండ నుంచి ఈపూరు మండలంలో సుమారు 10 కి.మీ. సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబునాయుడుల ఇంధన పొదుపు పిలుపును ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. సోడా బండి వద్ద ఆగిసోడా తాగారు. సోడా బండి యజమానితో కుటుంబ బాగోగులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రభుత్వాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ఆందోళన చేస్తున్న వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలో పార్టీ కార్యాలయం నుంచి లింగంగుంట్ల సమీపంలోని పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ఇంధన ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. రవాణా ఖర్చులు పెరగడం వల్ల కూరగాయలు, వంట నూనె తదితర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన ధరల తగ్గింపునకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తోందన్నారు.

● చిలకలూరిపేట: పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రజిని గృహం వద్ద నుంచి శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. అనంతరం పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ నుంచి నిరసన నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు రజనీతో పాటు పార్టీ శ్రేణులు నడుచుకుంటూ వచ్చి తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ దరియావలి, చిట్టా విజయభాస్కర రెడ్డి, టీ అంజిరెడ్డి, దేవినీడి శంకరరావు, వేములయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'రాకెట్ ల్యాబ్' నిర్వాహకులపై కేసు నమోదు

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో 'ర్యాకెట్ ల్యాబ్' పేరుతో ఘరానా మోసం వెలుగుచూసింది. నిందితులు రూ.3,000 నుంచి రూ.11,000వరకు చెల్లిస్తే విడతల వారీగా రూ.25 కోట్ల వరకు లాభాలు వస్తాయని ఆశ చూపించారు. ఈ మోసం నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో విస్తరించినట్లు సమాచారం. మొత్తం సుమారు 500మందికి పైగా బాధితులు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, నరసరావుపేటలోనే 263మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు నరసరావుపేట, చిలకలూరిపేటలో కార్యాలయాలు ఏర్పాటుచేసి ఈ దందాను కొనసాగించినట్లు తెలుస్తోంది. కేసానుపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు. ప్రధాన నిందితుడు చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకు చెందిన నాగండ్ల వెంకట్రావుతో పాటు అతని కుమారుడు వంశీ, భార్య, పీఏ నీరజలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు. అసాధ్యమైన లాభాలు ఇస్తామనే పథకాలను నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

## రేపు నరసరావుపేటలో మెడికల్ షాపులు బంద్

● ఎమ్మెల్యే అరవిందబాబుకు అసోసియేషన్ సభ్యుల వినతి

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన నరసరావుపేట నియోజకవర్గంలో మెడికల్ షాపులు బంద్ చేస్తున్నట్లు నరసరావుపేట తాలూకా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రకటించింది. సోమవారం నరసరావుపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 12.40 లక్షల కెమిస్టులు, డ్రగ్గిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు ఈ బంద్‌లో పాల్గొంటారన్నారు. ఈ ఫార్మసీల, కార్పొరేట్ సంస్థల డిస్కౌంటింగ్‌కు వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరుగుతోందన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీ శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీఎస్ మోహనరావు, ట్రెజరరీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపు మేరకు పట్టణంలోని అన్ని హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను బుధవారం మూసివేస్తున్నట్టు చిలకలూరిపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు సంఘం వారు సోమవారం తెలిపారు. పట్టణ పరిధిలో సుమారు వంద రిటైల్ మెడికల్ షాపులు, 20 వరకు హోల్‌సేల్ షాపులు ఉన్నాయి.

## అథ్లెటిక్స్‌లో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి కాంస్య పతకం



ప్రసన్నకుమార్

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారని ఎస్ఎస్ఎన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధీర్ సోమవారం తెలిపారు. ఈ పోటీలలో ఎస్ఎస్ఎన్ విద్యార్థి కే.ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ పోటీలలో కాంశ్యపతకం సాధించారని అన్నారు. కే ప్రసన్నకుమార్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్,మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, వైస్ ప్రెసిడెంట్ బత్తుల మురళీధరరావు, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస సాయి, పీడీ యక్కల మధుసూదనరావు, తదితరులు అభినందించారు.

## రాజీవ్‌గాంధీ కాలనీలో కార్డెన్ సెర్చ్

నాదెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీలో నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మోటారు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ ఈ కాలనీలో గంజాయి అమ్మేవారితో పాటు తాగే వారిని ఇటీవల 40 మందిని అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల స్టేషన్ ఇన్‌చార్జ్, ఐపీఎస్ అధికారి జే నిరంజన్, రూరల్ సీఐ సుబ్బ నాయుడు, అర్బన్ సీఐ రమేష్, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణ లో షిరిడి సాయిబాబా, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## జొన్నలగడ్డలో ఘనంగా సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయం 25వ వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో షిరిడి సాయిబాబాను దర్శించుకున్నారు. వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా జనరల్ సెక్రటరీ నల్లపాటి రాము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## పల్నాడు లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న లైసెన్స్‌డ్ ఇంజనీర్లు

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా లైసెన్స్‌డ్ ఇంజనీర్స్, సర్వేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలి జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఉన్నం వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నీటిపారుదల రంగానికి పితామహుడిగా పేరుగాంచిన ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కేఎల్‌రావు వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వంచే తాజాగా ప్రవేశపెట్టిన జీవోలపై రవి కిరణ్ సవివరంగా వివరణ ఇచ్చి, వాటి అమలు విధానం, ప్రాధాన్యతలను సభ్యులకు అర్థమయ్యేలా వివరించారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, జిల్లా చైర్మన్ జి.పి.రంగయ్య, జిల్లా కార్యదర్శి అబ్దుల్ కరీమ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు. ఇతర సభ్యులు రఘురాం, అనిల్, చిత్తజాలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




జన్ భాగిదారి జన జాగృతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా తదితరులు

## 25 వరకు జన్ భాగిదారి-జన జాగృతి ఉత్సవాలు

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): జన్ భాగిదారి- జన జాగృతి ఉత్సవాలు ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా అన్నారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఉత్సవాల పోస్టర్‌ను అమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజన సింహా మాట్లాడుతూ జన్‌మన్ పథకంతో గిరిజన ప్రాంతాల రూపురేఖలు మార్చడమే లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా అన్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా అర్జీలను స్వీకరించారు. ఆమెతో పాటు డీఆర్వో, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొని ప్రజల నుంచి 162 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దన్నారు. కాగా రెవెన్యూ క్లినిక్‌లో గురజాల నుంచి ఒకటి, సత్తెనపల్లి నుంచి 12, నరసరావుపేట నుంచి 8 మొత్తం 21 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

### డీఈవోపై చర్యలు తీసుకోవాలి... ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

నిబంధనలను తుంగలో తొక్కి మెరిట్‌కు అన్యాయం చేస్తున్న డీఈవోపై చర్యలు తీసుకోవాని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష జీసీడీవో, ఏఎల్ఎస్‌సీవో పోస్టుల భర్తీలో డీఈవో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మెరిట్ లిస్టులు సిద్ధమైనప్పటికి అర్హత లేని అభ్యర్థులకు అదనపు మార్కులు కలిపేందుకు డీఈవో జాప్యం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మస్తాన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతున్నారు

యడ్లపాడు మండలం జాలాదిలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దీనిపై ఫిర్యాదు చేశారు. పనిచేసే సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, జుగుప్సాకరంగా వాట్సప్ గ్రూపులో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై విచారణచేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## నాడు దోచేసి నేడు వీధిపోరాటాలా?: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అడ్డగోలుగా ప్రజల కష్టాన్ని దోచేసిన వైసీపీ నేతలు నేడు రాజకీయ లబ్ధికోసం ఇంధన ధరలపై వీధిపోరాటాలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి సోమవారం విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్లనే ప్రస్తుతం ఇంధన సంక్షోభం ఏర్పడిందని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆస్తిపన్ను, చెత్త పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఆర్టీసీ చార్జీలతో పాటు రికార్డు స్థాయిలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు చుక్కలు చూపించారని అన్నారు. దేశంలోనే ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయని 2020లో పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటించినప్పుడు అప్పటి సీఎం జగన్‌కు ప్రజల బాధలు గుర్తురాలేదా అని ప్రశ్నించారు. ఇసుక, మద్యం కుంభకోణాలతో సామాన్య, మధ్యతరగతి జీవితాలను రోడ్డున పడేశారని ఆరోపించారు.

## వైసీపీ హయాంలో ఇష్టానుసారం పన్నులు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారం పన్నులు వేసి ఇప్పుడు ఇంధన ధరలపై వీధి పోరాటాలు చేయడం హాస్యాస్పదం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆస్తిపన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచడంతో పాటు, తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారీ భారం మోపింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. వ్యాట్, రోడ్ల అభివృద్ధి సెస్ పేరులో వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.900 కోట్ల నుంచి రూ.1000 కోట్లు వరకు ప్రజల నుంచి వసూలు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మాత్రమే కారణం చేయడం తగదన్నారు. ప్రజలపై అదనపు భారం మోపకుండా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని షేక్ జానీ సైదా పేర్కొన్నారు.

## దేవరపల్లి బస్సుషెల్టర్‌లో పేట యువకుడి మృతదేహం



మృతుడు భాస్కర్

పర్చూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారిలో పర్చూరు మండలం, దేవరపల్లి సమీపంలోని బస్సు షెల్టర్‌లో సోమవారం యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు చిలకలూరిపేట, బిట్రవారివీధికి చెందిన చింతకాయల భాస్కర్ (35)గా గుర్తించారు. అయితే మృతదేహం వద్ద సూసైడ్ నోట్ ఉండటం, అప్పుల బాధతో తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మృతుడు పాలవ్యాపారిగా జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పులి గోపి తెలిపారు.

## లక్ష్మీకాంతారావుకు ఎమ్మెల్సీ రాజశేఖర్ నివాళి



లక్ష్మీకాంతారావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నాదెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన ధూళిపాళ్ళ లక్ష్మీకాంతారావుకు శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ సోమవారం నివాళులర్పించారు. గణపవరంలోని శాంతినగర్‌లో లక్ష్మీకాంతారావు భౌతిక కాయాన్ని ఆయన సందర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, కాట్రు శ్రీనివాసరావు, నాగభూషణం తదితరులు ఉన్నారు.